మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## ధాన్యం దిగుమతి సత్వరమే ప్రారంభించాలి

### -మిల్లర్లకు సూచించిన జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**సంగారెడ్డి బ్యూరో, నవంబర్ 2 ప్రభాతవార్త:**
బ్యాంక్ గ్యారంటీ, అండర్ టేకింగ్ అందజేసి వీలైనంత తొందరగా ధాన్యం దిగుమతి ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మిల్లర్లకు సూచించారు. శనివారం కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లాలోని రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ రైస్ మిల్లర్లతో జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు, దిగుమతిపై తగు సూచనలు, సలహాలు జారీ చేశారు. జిల్లాలో ధాన్యం కోతలు ప్రారంభమై కొనుగోలు కేంద్రాలకు ధాన్యం వచ్చిన దృష్ట్యా జిల్లాలోని మిల్లర్లు ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలకు ప్రకారం మిల్లర్లు ప్రభుత్వానికి సహకరించి బ్యాంగ్ గ్యారంటీ, అండర్ టేకింగ్ అందజేయాలని సూచించారు. జిల్లాలో రైతుల ధాన్యం వచ్చి ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉన్నదని, అకాల వర్షాలు కూడా రైతులపై ప్రభావం చూపే అవకాశం ఉన్నందున జిల్లాలోని మిల్లర్లు త్వరితగతిన బ్యాంక్ గ్యారంటీ, అండర్ టేకింగ్ అందజేసి వీలైనంత తొందరగా ధాన్యం దిగుమతి ప్రారంభించాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా మేనేజర్ హరికృష్ణ, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి సురేష్ రెడ్డి, మిల్లర్లు పాల్గొన్నారు.

## తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి



అదనపు కలెక్టర్ నగేష్‌కు మెమోరాండం అందజేస్తున్న దృశ్యం

**సంగారెడ్డి బ్యూరో, నవంబర్ 2 ప్రభాతవార్త:** బీజేపీ మెదక్ జిల్లా కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో శనివారం మెదక్ అదనపు కలెక్టర్ నగేష్‌కు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను త్వరితగతిన ఏర్పాటు చేయాలని, అదేవిధంగా తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని మెమోరాండం సమర్పించారు. భారత ప్రభుత్వం, దేశ ప్రధాని నరేంద్ర మోడీ దేశంలోని రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయాలని మద్దతు ధర ప్రతి సంవత్సరం పెంచుతున్నారని, కొనుగోలు సెంటర్లకు సంబంధించి పూర్తి డబ్బును, అదేవిధంగా దానికి సంబంధించిన వసతులను కేంద్ర ప్రభుత్వం సమకూరుస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో ఇంత వరకు ఏ ఒక్క కొనుగోలు కేంద్రంలో కూడా ఒక్క కిలో వడ్ల గింజలను కూడా కొనుగోలు చేయలేదని బీజేపీ జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. రైస్ మిల్లర్లతో రాష్ట్ర ప్రభుత్వం కుమ్మక్కై ఇంత వరకు కొనుగోలు కేంద్రాలకు నామమాత్రంగా కొబ్బరికాయలకే పరిమితమైందని, ఇంత వరకు ఒక్క గింజ కూడా కొనుగోలు చేయలేదని భారతీయ జనతా కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు బైండ్ల సత్యనారాయణ ఆరోపించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వెంటనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఎల్ఎన్ రెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు గడ్డం కాశీనాథ్, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల రమేష్, మెదక్ పట్టణ అద్య క్షులు నాయిని ప్రసాద్, ఓబీసీ మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చింతల శేఖర్, బీజేవైఎం నిజాంపేట మండల ప్రధాన కార్యదర్శి అభిషేక్ రెడ్డి, కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## శ్రీ వాణి నగర్ కాలనీలో బెల్ట్ షాప్‌లను తొలగించాలి

**అమీన్‌పూర్, నవంబర్ 2 ప్రభాతవార్త:**
అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ వాణి నగర్ కాలనీలో బెల్ట్ షాప్‌లను తొలగించాలని ఎక్సైజ్ సీఐ, పటాన్‌చెరు డీఎస్పీలకు కాలనీ వాసులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ శ్రీ వాణి నగర్‌లో సుమారు 10 బెల్ట్ షాప్‌లు నడుపుతున్నారని, 24 గంటలు మద్యం అందుబాటులో ఉంచుతూ కాలనీలో చిన్న చిన్న పనులు చేసుకునే లేబర్‌ని టార్గెట్ చేసి మద్యానికి బానిస చేస్తున్నారని తెలిపారు. ప్రతి రోజు గొడవులు చేస్తూ కాలనీ వాసులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని వాపోయారు. కావున తక్షణమే బెల్ట్ షాప్‌లను తొలగించి సురక్షితంగా వాణి నగర్‌ను ఉంచాలని కాలనీ వాసులు కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ గుప్తా, వెంకన్న, ఐలయ్య, వల్లభ, సురేష్, కృష్ణ, రమణ, తిరుమలేష్, నరసింహా గౌడ్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలులో జాప్యం

### -ట్యాబ్ లేదాయే
### -దాన్యం కొనరాయే
### -ప్రభుత్వ విధానంతో మిల్లర్లు ససేమిరా



కొనుగోలు కేంద్రం వద్ద టపర్లతో ధాన్యం కప్పి ఉంచిన దృశ్యం

**పాపన్నపేట, నవంబరు 2, ప్రభాతవార్త:** వరి ధాన్యం సేకరణ ప్రక్రీయలో ప్రభుత్వం నూతనంగా తీసుకువస్తున్న సంస్కరణ మూలంగా ధాన్యం కొనుగోలు కాక కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యపు రాసులు పేరుకుపోతున్నాయి. ఆరుగాలం శ్రమించి పండించిన పంట విక్రయాలు లేక రైతులు దళారులను ఆశ్రయించే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు ప్రక్రీయలో రెండు రకాలైన దొడ్డు, సన్నా రకం ధాన్యం కొనుగోలు చేసేందుకు పూనుకున్నా ధాన్యం సేకరణలో మాత్రం ఆలస్యం అవుతుండటంతో కర్షకులు ధాన్యం విక్రయించేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. ప్రతి గ్రామంలో కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం రాసులు పెరుకుపోతున్నాయి. మండలంలో ఇప్పటికే 6 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించుకోగా కేంద్రాల వద్ద ధాన్యం విక్రయాలు మాత్రం జరగలేదని రైతులు వాపోతున్నారు. కొనుగోలు కేంద్రాలకు ఇప్పటి వరకు ట్యాబులు అధికారులు అందివ్వలేదని ట్యాబులు లేక పోవడంతో ధాన్యం విక్రయిస్తే అవకతవకలు జరిపేందుకు ఆస్కారం ఉంటుందని కర్షకులు దాన్యం విక్రయాఉ జరిపేందుకు జంకుతున్నారు. దాన్యం విక్రయించిన ధాన్యం నమోదులో జాప్యం జరిగితే మొదటికే ముప్పు వాటిల్లుతుందని వాపోతున్నారు. అసలే అడపదడపా వర్షాలు కురుస్తుండటంతో ధాన్యం తడిసి ముద్దవుతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాల కారణంగా ఆరబెట్టిన ధాన్యం తడిసి ముద్దవుతుండటంతో కర్షకులు ధాన్యం మొలకెత్తి విక్రయాలలో నష్టం వాటిల్లుతుందని దిగాలు పడుతున్నారు. ప్రభుత్వం నుంచి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినా కొనుగోలు ప్రక్రయలో జాప్యం చోటుచేసుకోవడం మూలంగా కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యపు రాసులు వర్షాలతో తడిసి ముద్దవుతున్నాయి. ఆరబెట్టిన ధాన్యం సైతం మొలకలు వస్తుండటంతో పాటు ధాన్యం రంగు మారి నష్టపోయే అవకాశం ఉందని, తమ పరిస్థితి ఆగం అవుతామని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు చేసిన ధాన్యం ఏ రైసుమిల్లుకు ధాన్యం పంపాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేయక పోగా ప్రభుత్వం రా రైస్ మిల్లర్లు ధాన్యం కేటాయింపు కోసం బ్యాంక్ డిపాజిట్ చేయాలని డిమాండ్ పెట్టడంతో మిల్లర్లు ధాన్యం దింపుకునేందుకు ముందుకు రావడం లేదని విశ్వసనీ సమాచారం.

**-రా కు రాం...రాం...**

ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేసి పౌరసరఫరాల శాఖ అధికారుల ఆదేశాల మేరకు కొనుగోలు మిల్లులకు కేంద్రాలలో కొనుగోలు చేసిన ధాన్యం బియ్యంగా మార్చి ఇచ్చేందుకు మిల్లులకు కేటాయిస్తూ వచ్చారు. అయితే కొందరు మిల్లర్లు ప్రభుత్వానికి ధాన్యం మరడించి బియ్యంగా మార్చి ఇవ్వాల్సిన బియ్యం ఇవ్వకపోవంతో ప్రభుత్వం రా రైస్ మిల్లులకు ధాన్యం కేటాయించవద్దని నిర్ణయం తీసుకుంది. అయితే బకాయిలు చెల్లించాలిసన రా రైస్ మిల్లులను బ్యాల్ లిస్ట్‌లో పెట్టడమే కాకుండా వారి ఆస్తులను సైతం జప్తు చేసుకుంది. కాగా ఈ ఏట సక్రమంగా బియ్యం చెల్లింపులు చేసిన రా రైస్ మిల్లులకు ధాన్యం కేటాయించి అవుటన్ 67 కేజీల బియ్యం అందివ్వాలని కొరివి పెట్టడంతో తమకు ఇచ్చే ధాన్యంలో తేమ శాతం మూలంగా ప్రభుత్వం చెప్పినంత బియ్యం అందివ్వలేమని తమకు కేటాయిస్తే 58, 59 కేజీల బియ్యం అందిస్తామని రా రైస్ మిల్లర్లు అంటున్నారు అంతే కాకుండా ప్రభుత్వం తమకు కేటాయించిన ధాన్యంలో 25 శాతం బ్యాంకు సెక్యూరిటీ డిపాటిట్ చేయాలని డిమాండ్ చేయడం మూలంగా రా రైస్ మిల్లర్లు ధాన్యం దింపుకొనేందుకు ముందుకు రావం లేదని వాపోతున్నారు. గతంలో తాము మిల్లింగ్ చేసిన పాత బకాయిలు అందివ్వాలని ఈ ఏట మిల్లింగ్ చేయడానికి క్వింటాల్‌కు 300 నష్టపరిహారంతో పాటు మిల్లింగ్ చార్జి 150కి పెంచితేనే ధాన్యం దింపుకునేందుకు సై అంటామని రాష్ట్ర మిల్లర్ల సంఘం ముఖ్యమంత్రి రేవంతరెడ్డి, సంబంధిత మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలను కోరినట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా ప్రభుత్వం కొనుగోలు ప్రక్రీయలో స్పష్టమైన ఆదేశాలు జారీ చేసి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ట్యాబులను అందించి కొనుగోలు చేసిన ధాన్యం బస్తాలను ఎక్కడ దిపాలో సూచించి అన్నదాతలు విక్రయాలకు తీసుకు వచ్చిన ధానయం తూకం వేసి వారి ధాన్యం విక్రయాల సొమ్మువారి వారి బ్యాంక్ ఖాతాలో జమచేసేలా చూడాలని రైతులు కోరుతున్నారు.



కొనుగోలు కేంద్రం వద్ద అన్నదాతలు ధాన్యం ఆరబెట్టుకున్న దృశ్యం

## శాంతి భద్రతల పరిరక్షణలో విజిబుల్ పోలీసింగ్ కీలకం

### -జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి

**మెదక్ రూరల్, నవంబర్ 2 ప్రభాతవార్త:**
శనివారం జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి మెదక్ రూరల్ సర్కిల్ పరిధిలోని మెదక్ రూరల్ పోలీస్ స్టేషన్, సర్కిల్ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేసి పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. ఈ తనిఖీల్లో భాగంగా జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి అధికారులకు పలు సూచనలు చేస్తూ నేరాలను నియంత్రించడంతో పాటు శాంతి భద్రతలపై ప్రజలకు నమ్మకం కలగాలంటే విజబుల్ పోలీసింగ్ తోనే సాధ్యపడుతుందని, శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా విజబుల్ పోలీసింగ్ కీలకమని, విజబుల్ పోలీసింగ్‌లో భాగంగా విలేజ్ పోలీస్ అధికారులు, పెట్రో కార్, బ్లూ కోల్ట్ సిబ్బంది తరచూ గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజల్లో భద్రతా భావాన్ని పెంపొందించాలన్నారు. అనంతరం ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించే సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. పిదప పోలీస్ స్టేషన్ పరిసరాలు, సీసీ కెమెరాలు, సిబ్బంది పని తీరును పరిశీలించడంతో పాటు పెండింగ్‌లో తీవ్రమైన నేరాల సీడీ ఫైల్స్, స్త్రీరాస్థి చోరీలు, ఐటీ కేసుల ప్రస్తుత స్థితిగతులపై రికార్డులను తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదిదారులతో మార్యదపూర్వకంగా ఉంటూ వారి సమస్యలను ఓపికతో విని వాటిని పరిష్కరించాలని, ప్రజలకు మంచి సేవలు అందించేందుకు కృషి చేయాలని సూచించారు. ప్రజల మధ్యే ఉంటూ పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్న పోలీసుల పాత్రే కీలకంగా ఉంటుందని తెలిపారు. కాబట్టి సిబ్బంది పోలీస్ స్టేషన్‌లోని ప్రతి గ్రామం గురించి అవగాహన కలిగి ఉండాలని, ప్రజలతో మమేకమై ప్రజలకు మరింత చేరువ అవడానికి కమ్యూనిటీ పోలీసింగ్, ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానాన్ని అమలు పరచాలని, అదేవిధంగా ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యలను తీర్చాలని సూచించారు. ప్రజా ఫిర్యాదులలో ఎటువంటి జాప్యం చేయకుండా తక్షణమే స్పందించాలని పోలీసులకు సూచించారు. నేర దర్యాప్తులో సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కేసుల దర్యాప్తులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ పద్ధతులను పాటించాలని అన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో గస్తీ వాహనాలను నిరంతరం గస్తీలో తిప్పాలని, బీట్లు, పెట్రోలింగ్ సక్రమంగా నిర్వహించాలని అన్నారు. స్టేషన్ రికార్డులను, పరిసరాలను శుభ్రంగా ఉంచాలని తెలిపారు. జిల్లాలో పటిష్టమైన పోలీస్ వ్యవస్థ ఉంటుందని, ప్రజలకు అన్ని విధాల రక్షణ, భద్రత ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్, మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్ రెడ్డి, మెదక్ రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ మురళి, సిబ్బంది పాల్గొన్నారు.



పోలీస్ స్టేషన్‌లో రికార్డులను తనిఖీ చేస్తున్న ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి


## దేవాదాయ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలి



తహల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న బిజెపి నాయకులు

**కొమురవెల్లి, నవంబరు 2, ప్రభాతార్త :**
మండల కేంద్రంలోని శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయ పరిధిలోని దేవాదాయ భూములలో అక్రమంగా వెలిసిన నిర్మాణాలను బిజెపి మండల కమటి ఆధ్వర్యంలో శనివారం పరిశీలించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ లక్ష్మీనారాయణ, దేవాలయ ఏఈవో బుద్ధి శ్రీనివాస్‌లకు వినతి పత్రాలు అందజేశారు. ఈసందర్భంగా బిజెపి మండల అధ్యక్షులు బూర్గోజు నాగరాజు మాట్లాడుతూ అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలన్నారు. కొందరి నాయకుల అండదండలతో కొమురవెల్లి మల్లన్న భూములను కబ్జాలకు పాల్పడుతూ కిరాయిలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. మల్లన్న ఆలయ భూములను అన్యాక్రాంతం చేస్తున్నారని తెలిపారు. ఆలయ భూములను దేవాలయ అధికారులు కాపాడకుంటే బిజెపి ఆధ్వర్యంలో ఆందోళనలు చేయడంతో పాటు దేవాలయ ఈవో కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు ఘనబోయిన శ్రీనివాస్‌గౌడ్, పుట్ట కనకయ్య, జనగామ తిరుపతిగౌడ్, సానాది కర్ణాకర్, బచ్చలి రాజు, తకడపల్లి కనకయ్య, నరేడ్ల నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బాలికను కిడ్నాప్ చేసిన వ్యక్తికి రిమాండ్



పోలీసుల అదుపులో మైనర్ బాలికను కిడ్నాప్ చేసిన వ్యక్తి దృశ్యం

**న్యాల్‌కల్, నవంబరు 2, ప్రభాతవార్త:**
మాయమాటలు చెప్పి మైనర్ బాలికను కిడ్నాప్ చేసిన వ్యక్తిని శనివారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ చల్ల రాజశేఖర్ తెలిపారు. ఎస్ఐ రాజశేఖర్ కథనం ప్రకారం ఇందుకు సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. పోలీసు ఠాణా పరిధిలోని మామిడ్గి గ్రామానికి చెందిన ఈడిగి వినోద్ గౌడ్ (21) అదే గ్రామానికి చెందిన మైనర్ బాలికను ప్రేమిస్తున్నానంటూ మాయ మాటలు చెబుతూ బాలిక సెల్ ఫోన్ నంబరు తీసుకుని నిత్యం మాట్లాడుతూ చాటింగ్ చేస్తూ ఉండేవాడన్నారు. కుటుంబ పెద్దలు తమ పెళ్లికి అంగీకరించరని అని నమ్మబలుకుతూ ఎక్కడికైనా వెళ్లి పెళ్లి చేసుకుందామని మాయ మాటలు నూరిపోసి బాలికను అక్టోబరు 22న రాత్రి 11.30 గంటల ప్రాంతంలో బాలికలు హైద్రాబాద్‌కు బలవంతంగా తీసుకుపోయి మరుసటి రోజు 23 అక్టోబరు రోజున తిరిగి రాత్రి 8 గంటల ప్రాంతంలో బాలికను మామిడ్గికి తీసుకువచ్చాడన్నారు. బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి (ఫోక్సో కేసు) నిందితుడిని అదుపులోకి తీసుకున్నామన్నారు.

## పెండింగ్ బిల్లులు చెల్లిండంతో పాటు పిఆర్‌సిని అమలు చేయాలి : టిపిటిఎఫ్



సమావేశంలో మాట్లాడుతున్న టిపిటిఎఫ్ నాయకులు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**
పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు చిట్యాల విజయేందర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కనకయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పొనమల్ల రాములు, సీనియర్ నాయకులు తిరుపతిరెడ్డిలు డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా కమిటీ సమావేశం శనివారం జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. పిఆర్‌సిని వెంటనే అమలు చేయడంతో పాటు ప్రాథమిక, ప్రాథమికొన్నత పాఠశాలల్లో పని చేసే ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలన్నారు. కులగణన విధులను కేవలం ప్రభుత్వ స్థానిక సంస్థలు, ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు మాత్రమే కేటాయించడాన్ని ఖండిస్తూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పాఠశాల నిర్వహించి మధ్యాహ్న భోజనం పెట్టించి అనంతరం సెన్సెస్ విధులు హాజరు కావాలని ఉత్తర్వులు ఇచ్చారని..మధ్యాహ్నం సర్వేకు వెళ్లితే గ్రామస్తులు ఎవరూ అందుబాటులో ఉండారని తెలిపారు. ఉదయం పూట సర్వే నిర్వహించి పాఠశాలలకు ఆటంకం కలగకుండా నిర్వహించేలా కుల గణన ఉత్తర్వులను సవరించి విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సుంచు నరేందర్, రాష్ట్ర కౌన్సిలర్లు రాజు, రాజయ్య, తిరుపతి, రామస్వామి, ఉపాధ్యక్షులు నర్సింహ్మారెడ్డి, పాపిరెడ్డి, అజీజ్, ప్రభాకర్, కార్యదర్శులు సత్యనారాయణ, శివాజీ, రాంరెడ్డి, రాములు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## బిసి కులగణ సర్వేను విజయవంతం చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

**సిద్దిపేట అర్బన్, నవంబరు 2, ప్రభాతవార్త :**
కాంగ్రెస్ ప్రభుత్వం తలపెట్టిన బిసి కులగణ సర్వేను విజయవంతం చేయాలని జిల్లా గ్రంధాలయ చైర్మన్ లింగమూర్తి, డిసిసి అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి, సిద్దిపేట, దుబ్బాక నియోజకవర్గాల పార్టీ ఇంచార్జిలు పూజల హరికృష్ణ, చెరుకు శ్రీనివాస్‌రెడ్డిలు పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలోని డిసిసి కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం చేపడుతున్న బిసి కులగణన సర్వేలో కాంగ్రెస్ నాయకులు పాల్గొని ప్రజలకు అవగాహన కల్పిస్తూ వార్డు అధికారులతో కలిసి సర్వేలో పాల్గొనాలన్నారు. బిసి కుల గణన ద్వారా బిసిలందరికీ న్యాయం జరుగుతుందన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఆరు గ్యారెంటీలు అమలు చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే కులగణన సర్వే ద్వారా స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో రిజర్వేషన్లు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. బిసి కులాలపై వారి కులవృత్తులు ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ఎదుకర్కొంటున్న ఇబ్బందులు తదితర అనేక అంశాలపై సర్వే ద్వారా తెలుస్తుందన్నారు. గతంలో బిసి కులగణనకు ఎన్నో కమిషన్లు వేసిన ఫలితం శూన్యమన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు డాక్టర్ లక్కరసు సూర్యచంద్రవర్మ, ఎం.డి.ఇమామ్(అత్తు), దేవుల పల్లి యాదగిరి, సొప్పందడి చంద్రశేఖర్, జి.శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

## విదేశాల నుండి వచ్చిన విద్యార్థి రోడ్డు ప్రమాదంలో మృతి

**వెల్దుర్తి, నవంబర్ 2 ప్రభాతవార్త:**
విదేశాల నుండి స్వదేశానికి వచ్చిన ఒక విద్యార్థి శనివారం తెల్లవారు జామను సుచిత సర్కిల్‌లో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న క్రమంలో అదుపుతప్పి క్రింద పడిపోవడంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. మండల పరిధిలోని ఆరెగూడెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, మాజీ సింగిల్ విండో డైరెక్టర్ మహిపాల్ రెడ్డి, ఇందిర దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉండగా ఇటీవల కుమార్తె వివాహం చేశారు. మహిపాల్ రెడ్డి ఇద్దరు కుమారులు విదేశాల్లో ఉన్నత చదువులు చదువుతున్నారు. ఈ క్రమంలో చిన్నకుమారుడైన సాయి కిషోర్ రెడ్డి (24) లండన్‌లో ఎంబీఏ పూర్తి చేసుకొని ఇటీవల ఇంటికి వచ్చినట్లు గ్రామస్థులు తెలిపారు. శనివారం తెల్లవారు జామున మూడున్నర గంటల ప్రాంతంలో తన స్నేహితుడితో కలిసి పని నిమిత్తం తన ద్విచక్ర వాహనంపై వెళ్తున్న క్రమంలో రోడ్డు మధ్యలో ఉన్న పైప్‌కి తగిలిన వాహనం అదుపుతప్పి పడిపోవడంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. విదేశాల్లో ఉన్నత చదువులు పూర్తి చేసుకొని ఉద్యోగం చేస్తూ తమను పోషించే కొడుకు విగత జీవి కావడంతో మహిపాల్ రెడ్డి దంపతుల రోధనలు మిన్నంటాయి. ఈ సంఘటనలో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

### -మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితవెంకన్న

**హుస్నాబాద్‌టౌన్, నవంబరు 2, ప్రభాతవార్త**
పట్టణ ప్రజలందరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితవెంకన్న అన్నారు. శనివారం రోజున పట్టణంలోని 1వ వార్డు నేతాజీనగర్‌లో గల పట్టణ ప్రకృతివనంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సరీలోని పిచ్చి మొక్కలు, గడ్డిని సిబ్బందితో కలసి తొలగించారు. పర్యావరణ పరిరక్షణ కోసం నిర్వహిస్తున్న ఇలాంటి కార్యక్రమాలలో ప్రతీ ఒక్కరు పాల్గొని హుస్నాబాద్‌ను స్వచ్ఛ హుస్నాబాద్‌గా మార్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మెన్ అయిలేని అనితశ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్ కొంకటి నళినిరవి, కోఆప్షన్ సభ్యులు ఎండి అయూబ్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ బాల ఎల్లం, అయూబ్, వన మహోత్సవ్ సూపర్‌వైజర్ జాలిగం శంకర్, పర్యావరణ అధికారి రవికుమార్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## మధ్యవర్తులను నమ్మి మోసపోవద్దు : ఎస్ఐ

**అక్కన్నపేట, నవంబరు2, ప్రభాతవార్త :** వివిధ సమస్యలపై పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలు మధ్యవర్తులను నమ్మి ఆర్థికంగా నష్టపోతున్ననట్లు తమ దృష్టి కి వచ్చిందని, ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా పోలీస్ స్టేషన్‌కు వచ్చి కలిసే హక్కు ఉందని అక్కన్నపేట ఎస్ఐ విజయ్‌భాస్కర్ తెలిపారు. శనివారం పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ గ్రామాలలో జరిగే గొడవ లు, పంచాయతీలు వంటిని జరిగినప్పుడు ఫిర్యాదు దారులు పెద్ద మనుషు లు, మధ్యవర్తులను తీసుకురావడం వల్ల కొంత మంది వారి వద్ద పోలీసులకు డబ్బులు ఇవ్వాలని వసూళ్లకు పాల్పడుతున్నట్లు సమాచారం అందిందన్నా రు. ఫిర్యాదు దారులు పోలీస్ స్టేషన్‌కు వచ్చే టప్పుడు ఎలాంటి భయం లేకుండా రావచ్చన్నారు. ఇక ఫిర్యాదుల విషయానికి వస్తే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు ఇవ్వాలని చెప్పి భయట వ్యక్తులకు డబ్బులిచ్చి మరీ రాయించు కుంటూ నష్టపోతున్నారన్నారు. ఫిర్యాదులు కూడా వారి సిబ్బంది రాస్తారని ప్రజలు ఎవరిని నమ్మి పోలీసులకు డబ్బులు ఇవ్వాలంటే నేరుగా తనకు లేదా 100కు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఇక మండల కేంద్రంలో అక్రమ ఇసుక, మట్టి, గంజాయిలతో పాటు అసాంఘీక కార్యకలాపాలను ఎవరు పాల్పడిన ఉపేక్షించేది లేదన్నారు. వారు ఎంతటి వారైన చట్టపరమైన చర్యలు తీసు కుంటామని హెచ్చరించారు.

## ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లు సీజ్

**కోహెడ, నవంబరు 2, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని తంగళ్లపల్లి మోయతుమ్మెద వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు శనివారం సీజ్ చేశారు అదే గ్రామానికి చెందిన చొప్పరి లింగం, రాయవేనికు మార్‌లు అక్రమంగా ట్రాక్టర్లల్లో ఇసుక తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## విద్యాధికారి సేవలు ఆదర్శనీయం



విద్యాధికారి గోపాల్‌ను సన్మానిస్తున్న దృశ్యం

**నవాబుపేట నవంబరు 2,ప్రభాతవార్త:** మండల ఎఫ్ఎస్‌సీ విద్యాధికారిగా9 సంవత్సరాలు సేవలందించిన గోపాల్ సేవలు ఆదర్శనీయమని పలువురు వక్తలు కొనియాడారు. బదిలీపై వెళ్ళిన ఆయనకు శనివారం మండల కేంద్రంలో ఆత్మీయ వీడుకోలు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఏలాంటి ఆరోపణలు లేకుండా ఏకకాలం మండలంలో విధులు నిర్వహించడం విశేషమని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాధికారి అబ్దుల్‌రహమాన్, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు బాలు, కార్యదర్శి విజయ్‌కుమార్‌రెడ్డి, యూటీఎఫ్ అధ్యక్షుడు రవీందర్, టీయూటీఎఫ్ అధ్యక్షుడు మైపాల్, ఆయా ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యయులు, ఉపాధ్యయులు తదితరులు పాల్గొన్నారు.

## వెంకటాపూర్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి

**ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 2, ప్రభాతవార్త:** పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వెంకటాపూర్ చెరువు ఒడ్డున గుర్తు తెలియని వ్యక్తి శవాన్ని పోలీసులు కనుగొన్నట్లు శనివారం తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. దాదాపు 35 నుండి 40 సంవత్సరాల వయస్సు కల్గిన వ్యక్తి మృతి చెంది ఉండగా సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలికి వెళ్లి చూడగా గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నట్లు తెలిపారు. మృతుడి వంటిపై ఎర్ర రంగు చొక్కా ధరించి ఉన్నట్లు తెలిపారు. మృత దేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం నగరంలోని గాంధీ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోచారం ఐటీ కారిడార్ పోలీసులు తెలిపారు.

## పార్టీకి కార్యకర్తలే కొండంత అండ



సభ్యత్వనమోదులో పాల్గొన్న అందె బాబయ్య

**జిల్లెడుచౌదరిగూడ, నవంబరు 02,ప్రభాతవార్త :** పార్టీ పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందాలంటే కార్యకర్తలే కొండంత అండగా నిలబడాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య అన్నారు. శనివారం జిల్లెడు చౌదరిగూడ మండలంలోని గుంజల్‌పహాడ్, జాకారం గ్రామాల్లో బిజెపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహంచారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బాబయ్య మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్రమోది పాలన చూసి ఎంతోమంది పార్టీలో సభ్యత్వాలు తీసుకుంటున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వ పాథకాలను ప్రజలకు పూర్తిస్థాయిలో వివరించాల్సిన భాధ్యత ప్రతికార్యకర్తపై ఉందని ఆయన తెలిపారు. రాబోవు రోజుల్లో తెలంగాణలో బిజెపి అధికార పగ్గాలు చేపడుతుందని ఆయన పెర్కోన్నారు. బిజెపి జిల్లా ఉపాధ్యాక్షుడు కమ్మరి భూపాలచారి, మండల అధ్యక్షుడు బోయ కుర్మయ్య, మనోహార్‌రెడ్డి, మారుతిచారి, శ్రీశైలం, యాదయ్య, నరేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

## మార్కెట్ కార్యాలయ భవన నిర్మాణానికి నిధుల కోసం వినతి

-కడా అధికారికి మార్కెట్ కమిటీ ఛైర్మన్ వినతి



కడా అధికారిని కలిసిన మార్కెట్ కమిటీ ఛైర్మన్

**కొడంగల్,నవంబరు 1ప్రభాతవార్త :** కొడంగల్ పట్టణంలోని మార్కెట్ కమిటీ కార్యాలయ భవన నిర్మాణానికి నిధులు మంజూరీ చేయాలని మార్కెట్ కమిటీ చైర్మేన్ అంబయ్యగౌడ్ కోరారు.ఈ మేరకు ఆయన శనివారం పట్టణంలోని కడా కార్యాలయంలో కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్ యార్డు కార్యాలయ భవన నిర్మాణానికి అలాగే వ్యాపార సముదాయాలకు సంభందించి నిధులు కేటాయించాలని కోరారు.మార్కెట్ కమిటీ కార్యాలయంతోపాటు వ్యాపార సముదాయాలకు సంభందించి అంచనా వేయడం జరిగిందని,అందుకు సంభందించిన పత్రంను కడా అధికారికి అందించారు.కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మేన్‌తో పాటు మార్కెట్ యార్డు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఓటరుగా నమోదు చేయించాలి

-తహశీల్దార్ విజయ్‌కుమార్



మాట్లాడుతున్న తహశీల్దార్ విజయ్‌కుమార్

**కొడంగల్,నవంబర్ 1ప్రభాతవార్త :** 18 ఏళ్ళు నిండిన యువతి, యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఓటు ప్రాముఖ్యతను గుర్తించాలని తహశీల్దార్ విజయ్‌కుమార్ సూచించారు.శనివారం పట్టణ శివారులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలతో పాటు మున్సిపల్ పరిధిలోని పాతకొడంగల్ శివారులోని గిరిజన గురులకు విద్యాలయంలో వేరు వేరుగా ఓటు హక్కు,నమోదుపై అవగాహన కల్పించారు.నవంబర్ 9,10 తేదిల్లో ఓటరు నమోదు,మార్పులు,చచేర్పులకు ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు.ఇందుకుగాను 18 ఏళ్ళు నిండిన యవతి,యువకులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.కార్యక్రమంలో గిరిజన గురుకుల విద్యాలయ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు,డిగ్రీ కళాశాలఅద్యాపకులు రాంబాబులతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## మాజీ ఎంపిటిసి మద్దూరి పాండుకు మాతృవియోగం

**షాబాద్, నవంబరు 2, ప్రభాతవార్త :** తాళ్లపల్లి మాజీ ఎంపీటీసీ, కురుమ సంఘం మండల అధ్యక్షుడు మద్దూరి పాండు తల్లి మద్దూరి పోచమ్మ ఆనారోగ్యంతో శనివారం మృతి చెందారు. పలువురు నాయకులు, పలు సంఘాల నాయకులు పాండును, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

# గ్రామాల్లో కనిపించని సినిమా సందడి.. ప్రశ్నార్థకమవుతున్న థియేటర్లు



నవాబ్‌పేట సినిమా థియేటర్

**నవాబుపేట నవంబర్ 2, ప్రభాతవార్త:** గ్రామాల్లో సినిమాల ఊసే లేకుండా పోతోంది. వెండి తెరను మింగేస్తున్న బుల్లితెర అని చెప్పక తప్పదు. ఎందుకంటే గ్రామాల్లో సహితం సినిమా స్థానంలో సీరియల్ చేరింది. అక్షరాస్యులు మొదలు నిరక్ష్య రాస్యులు నిత్యం బుల్లితెరలో ప్రసారమైయ్యే సీరియళ్లపై రోజురోజుకు ఆసక్తిపెంచు కుంటున్న తీరు కొనసాగుతోంది. పొలం పనులు చేసుకునే మహిళలు పొలంపనులు ముగిశాక సాయంత్రం ఇళ్ళకు చేరుకుని వంటపని ముగించు కుని టీవీల ముందు ఆసీనులు తున్నారు. అభిరుచికి తగినసీరియల్లు చూస్తూ నయనానందం పొందుతున్నారు. మహిళలతో పాటు పురుషులు కూడా సీరియళ్లను చూడటానికి ఆసక్తి చూపడం విశేషం. ఈ నేపథ్యంలో సిమాల ఊసే మరిచారు. నాడు సిమాలంటే తిరస్కరించే వారు ఉండరంటే అతిశ యోక్తిలేదు. చిన్నారులు మొదలుకొని ముదుసలి వరకు సినిమాలంటే చెవికోసుకునేవారు. సినిమా చూసింది మొదలు ఎక్కడ నలుగురు గుమిగూడినా సినిమా ముచ్చట్లు వినిపించేంతగా ప్రజపై సినిమా ప్రభావం ఉండేది. ఈ చర్చలతో ప్రేరణ పొంది సినిమా చూడనివారు వీలు కల్పించుకుని సినిమా చూసి సంబురపడే తీరు గ్రామాల్లో కనిపించేది. ఏదైనా సినిమా బాగుందని ప్రచారం జరిగితే ఆసినిమా పంట పండినట్లే, తండో పతండాలుగా సినిమాటాకీసులకు ప్రజలు చేరుకుని టికెట్లకోసం నానా యాతనపడి టికెట్లు చేజిక్కించుకునిసినిమా తిలకించి ఆనందపడేవారు. టికెట్లు లభించని వారు బ్లాకులో యత్నించేవారు అప్పటికీ లభించక పోతే తీవ్ర నిరాశకుగురై అందుబాటులో మరో థేటర్ ఉంటే అక్కడికి పరుగులు తీసి టికెట్లు లభిస్తే ఇష్టంగానే మరో సినిమాచూసి ఆరోజుకి శాంతించేవారు. నాడు సినిమా ఒక వ్యసనం దాని కోసంఎంతకైనా తెగించే ప్రేక్షకులు ఉండేవారు. పాఠశాలలకు, కళాశాలకు, పనులకు ఎగనామం పెట్టిమరి సినిమాలు చూసే రోజులు నేడు తీపి గుర్తులుగా మిగిలాయి. అయితే కొన్ని సినిమాలు గ్రామీణ ప్రజలను విపరీతంగా ప్రభావితం చేసినవాటిలో భక్తప్రహ్లాద, బాల నాగమ్మ, కరుణా మయుడు, వీరబ్రహ్మేంద్రస్వామి చరిత్ర, ఇంటో్లరామయ్య వీధిలో కృష్ణయ్య పచ్చని కాపురం, ఒసేయ్‌రాములమ్మ, పుట్టింటికి రాచెల్లి, అమ్మోరు, ఎర్రసైన్యం, గత ఏడాది వచ్చిన బలగం తదితర సినిమాలు గ్రామీణ ప్రజలను అధికంగా కదిలించిన వాటిలో రామాయణం, మహాభారతం ఇతివృత్తంతో తెరకెక్కిన పలుచిత్రాలు ప్రధాన మైనవని పలువురు కొనియాడారు. ముఖ్యంగా చరిత్ర ఆధారంగా,గ్రామీణ ఇతివృతంతో తెరకెక్కిన సినిమాలపట్లగ్రామీణప్రజలు ఆదరించిన సినిమాలు ఉన్నాయని వారు తెలిపారు. అంతేకాకుండా కుటుంబ సభ్యులతోకలిసి చూసే వాటిని ఇష్ట పడ్డారని చెప్పారు. నేడు తీస్తున్న సినిమాలు గ్రామీణ ప్రజలను కదిలించేవిగా ఉండటంలేదని చెబుతున్నారు. ఏదిఏమైనా సినిమాలపై ప్రజల్లో ఆసక్తి తగ్గు ముఖంపడుతోంది.

నిర్మాణవ్యయంపెరిగిందని ప్రేక్షకులు తగ్గారని పరిశీలకులు భావిస్తున్నారు. పాన్‌ఇండియా పేరిట వసూళ్ళు చేసుకుని నిర్మాతలు బయట పడుతున్నారే తప్ప అధికమొత్తం ప్రేక్షకులను థేటర్లకు రప్పించలేక పోతున్నారని అంటున్నారు. ఇప్పటికే కొన్ని హాళ్ళు మూత పడ్డాయని దీంతో సినిమా హాళ్ళ పరిస్థితి అగమ్యగోచరంగానే ఒదని భవిష్యత్తులో ఓటీటీయే ప్రధాన మవుతుందని పరిశీలకులు భావిస్తున్నారు.

# విద్యార్థులకు న్యాయం చేస్తాం : అందె మోహన్

**యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మోహన్**



థ్యాంక్యూ సిఎం అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

**షాద్‌నగర్, ప్రభాతవార్త, నవంబరు 02 :** ఖజానాలో కాసుల వర్షం కురిసేలా ప్రభుత్వం ప్రణాళికలు చేస్తుంది.. గ్యారంటీల అమలు ఒకవైపు, సంక్షేమాభివృద్ధి మరోవైపు పరుగులు పెడుతుందని యువజనషాద్‌నగర్ కాంగ్రెస్‌నాయకులు, కాంగ్రెస్‌రాష్ట్ర ప్రధానకార్యదర్శి అందె మోహన్ అన్నారు. శనివారం ఆయన పట్టణంలోని ప్రభుత్వ సాంఘీక సంక్షేమ కళాశాలను సందర్శించారు.

ఈ సందర్భంగా ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ సంక్షేమ గురుకులాల్లో,వసతిగృహాల్లో చదువుకుంటున్న విద్యార్థులకు ప్రభుత్వం డైట్ చార్జీలు, కాస్మోటిక్ చార్జీలు భారీగా పెంచుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని ఆనందం వ్యక్తం చేశారు.

3వ తరగతి నుండి 7వ తరగతి వరకు రూ.950గా ఉన్న డైట్ చార్జీలను రూ.1330కి పెంచిందని, అలాగే 8వ తరగతి నుండి 10వ తరగతి వరకు రూ.1100 నుంచి రూ.1540 లకు పెంచిందని, ఇంటర్ నుంచి పీజీ వరకు డైట్ చార్జీలను రూ .1500 నుంచి రూ.2100లుగా పెంచారని పేర్కొన్నారు. దీంతో పాటు 3 నుంచి 7వ తరగతి వరకు ఒక్కో విద్యార్థికి రూ.55గా కాస్మోటిక్ చార్జీలను రూ.175కు పెంచిందని, 8వ తరగతి నుంచి 10వ తరగతి వరకు రూ.75 నుంచి రూ.275కు పెంచిందని తెలిపారు. తెలంగాణలోని సంక్షేమ హాస్టళ్లలో 7,65,700 మంది విద్యార్థులు ఉన్నారని అందె మోహన్ పేర్కొన్నారు.ఏడాదిక్రితం కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరే సమయానికి రాష్ట్ర ఖజానా ఒట్టిపోయి ఉందని, ఖజానా లోటు రూ.3 వేల కోట్ల పైమాటేనని, ఇలాంటి పరిస్థితుల్లో బాధ్యతలు చేపట్టిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రజలపై ఎక్కడా భారం పడకుండా అభివృద్ధి చేస్తున్నారని పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో 2008లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఈ డైట్ చార్జీలను పెంచిందని, ఇన్నేళ్ల తర్వాత మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వమే విద్యార్థులకు డైట్ చార్జీలు పెంచిందన్నారు. ఈ పెంపు వల్ల రాష్ట్ర ఖజానాపై నెలకు రూ.300 కోట్లు భారం పడుతున్నా, ఉద్యోగులకు 3.64 శాతం డీఏను ప్రభుత్వం ప్రకటించిందని, గత పాలకులు ఇష్టారీతిన చేసిన అప్పులకు అసలు, వడ్డీని చెల్లిస్తూ సంక్షేమాన్ని, అభివృద్ధి పరుగుతు పెట్టిస్తూ అత్యంత క్రమశిక్షణతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గాడిలో పెడుతున్నారని అందెమోహన్ అన్నారు. యువజన కాంగ్రెస్, ఎన్ఎస్ఐ నాయకులు పాల్గొన్నారు.

# సమగ్ర కుటుంబ సర్వేకు శ్రీకారం

**వార్డుల వారీగా ఇళ్లను గుర్తించి స్టిక్కర్స్ ఏర్పాటు**

**శామీర్‌పేట, నవంబరు 2, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు ఎన్యుమరేటర్లు శ్రీకారం చుట్టారు. శామీర్‌పేట ఉమ్మడి మండలంలోని వివిధ గ్రామాల్లో ఎన్యుమరేటర్లు సర్వేకు ముందుగా వార్డుల వారీగ ఇళ్లను గుర్తించి ఇంటింటా స్టిక్కర్స్ అతికిస్తున్నారు. ఆ తరువాత సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను ప్రారంభించనున్నారు. ప్రతి ఎన్యుమరేటర్‌కు 150ఇళ్ల నుంచి 200ఇళ్ల వరకు సర్వే చేయటానికి గుర్తిస్తున్నట్లు సమాచారం. అయితే ముందుగా వార్డుల వారీగ ఇళ్లను సందర్శించి ఇంటికి స్టిక్కర్లు వేస్తున్నారు. శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలాలల్లో, తూంకుంట మున్సిపాల్టీలోనూ వివిధ గ్రామాల్లో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు శ్రీకారం చుట్టారు. రాష్ట్ర ప్రభుత్వం సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే చేయటానికి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే చేయటానికి అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసింది. ఈ సర్వే ప్రధానంగ కులగణన కోసం జరుగనుందని సమాచారం. బిసిల కులగణన, వివిధ కులాల గణన కూడ ఈ సమగ్ర సర్వేతో కులగణన తెలియనున్నట్లు స్పష్టం అవుతుంది. ఈ సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రొఫార్మాలో 56 అంశాలతో కూడిన వాటిని కుటుంబ వివరాలు సేకరించనున్నారు. ఈ సర్వేలో ప్రధాన పాత్ర ఎన్యుమరేటర్లది ఉండనుంది. వీరిపై సూపర్‌వైజర్లు, పర్యవేక్షణ అధికారులు, మండల స్థాయి, మున్సిపాల్టీ స్థాయి, జిల్లాస్థాయిలో సంబంధిత అధికారులు సందర్శించి తనిఖీలు చేయనున్నారు.

జిల్లాకలెక్టర్, అదనపు కలెక్టర్లు కూడ పర్యటించనున్నారు. శనివారం శామీర్‌పేటలో జిల్లా కలెక్టర్ గౌతమ్ పర్యటించి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే చేయటానికి ఇళ్లకు అంటిస్తున్న స్టిక్కర్స్‌ను పరిశీలించిన సంగతి విధితమే. ఇక శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలాల్లోని వివిధ గ్రామాల్లో, తూంకుంట మున్సిపాల్టీలోని వివిధ గ్రామాల్లో సమగ్ర ఇంటింటికి కుటుంబ సర్వే కార్యక్రమం కొనసాగుతుంది. ఈ నెల 6వ తేదీ నుంచి ఈ సర్వేను పూర్తి స్థాయిలో నిర్వహించటానికి అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేస్తూ ముమ్మరం చేయనున్నారు.

## చౌడమ్మగుట్ట ఆంజనేయస్వామి ఆలయంలో పల్లకి సేవ



ఆంజనేయస్వామి పల్లకి సేవలో పాల్గొన్న భక్తులు

**షాద్‌నగర్, ప్రభాతవార్త, నవంబరు 02 :** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని సోలీపూర్ చౌడమ్మగుట్ట ఆంజనేయ స్వామి దేవాలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భజన బృందం ఆధ్వర్యంలో స్వామి వారి పల్లకి సేవ వైభవంగా నిర్వహించారు. స్వామివారి విగ్రహాన్ని పల్లకిలో మోస్తూ శ్రీరామ జయరామ జయజయ రామ అంటూ భక్తులు పెద్దఎత్తున ఊరేగింపు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు రఘుపతిరావు, రాఘవేంద్ర చార్య, అర్చకులు కృష్ణ, ప్రమోద్, సునీల్ పంతులు భక్తులకు ప్రత్యేకపూజలు నిర్వహించి తీర్థ, ప్రసాదాలు అందజేశారు. అనంతరం దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

దేవాలయ ఆవరణలోని శ్రీకృష్ణ గోశాలకు మోతీ ఘనాపూర్ గ్రామంలోని నవదుర్గ కంపెనీ మేనేజర్ బోలారాం 15 వేల రూపాయల విలువ గల దాణాను అందజేశారు. దేవాలయ అభివృద్ధికి, అన్నదాన కార్యక్రమానికి దాతలు సహకరించాలని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు శ్రీశైలం గౌడ్ కోరారు. పులిమామిడి శ్రీశైలం గౌడ్, చెట్ల వెంకటేష్, రఘునందర్ రెడ్డి, క్యూసెట్ శ్రీనివాస్, కిషన్ నాయక్, రాఘవేందర్, నారాయణ, వీర్లపల్లి కృష్ణయ్య, లక్ష్మీకాంత్ రెడ్డి, కృష్ణచారి, శంకరయ్య యాదవ్, వీఆర్వో బచ్చన్న, యాదగిరి, పి.ప్రవీణ్ గౌడ్, పద్మ వెంకటేష్, గోరియా నాయక్, కొత్త సత్తయ్య గౌడ్, శ్రీనివాస్, రమేష్, సుధాకర్ రెడ్డి, హనుమంత్ రెడ్డి, రవీందర్, మాజీ వార్డు సభ్యులు సింగపాగ లక్ష్మయ్య, భజన, భక్త బృందం, మహిళలు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ వినియోగదారుల దినోత్సవం

..శామీర్‌పేట విద్యుత్ ఎఇ రాఘవేందర్

శామీర్‌పేట, నవంబరు 2, ప్రభాతవార్తవిద్యుత్ వినియోగదారుల దినోత్సవం (సదస్సు)ను ఆదివారం నిర్వహిస్తున్నట్లు శామీర్‌పేట విద్యుత్ ఎఇ రాఘవేందర్ నేర్కొన్నారు. శామీర్‌పేట విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రాంగణంలో ఆదివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ వినియోగదారుల దినోత్సవం (సదస్సు) జరుగుతుందన్నారు. విద్యుత్ సమస్యలను పరిష్కరించుకోవటానికి ఈ సదస్సు దోహదపడుతుందన్నారు. విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకరావచ్చని అన్నారు. విద్యుత్ బిల్లులు ఎక్కువ, తక్కువ వస్తున్న, అధికంగ వస్తున్న సదస్సులో అధికారుల దృష్టికి తీసుకరావచ్చని పరిష్కరించుకోవచ్చని ఆయన అన్నారు. ఎలాంటి విద్యుత్ సమస్యలైనా వాటి పరిష్కారానికి అధికారుల ముందు తెలుపవచ్చని అన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ సదస్సును సద్వినియోగం చేసుకోవాలని, సమస్యలను పరిష్కరించుకోవాలని ఎఇ రాఘవేందర్‌రావు సూచించారు

# సదర్ సమ్మేళనం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శంకర్



పోస్టర్‌ను విడుదలచేసిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**సదర్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడిని సన్మానించిన ఎమ్మెల్యే**

**షాద్‌నగర్, ప్రభాతవార్త, నవంబరు 02 :** కురుక్షేత్ర యుద్ధంలో ధర్మాన్ని కృష్ణార్జునులు గెలిపించారని, అలాంటి గొప్ప యాదవ కుటుంబంలో నుంచి వచ్చిన యాదవ జాతి ఎంతో గొప్పదని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారంఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సదర్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు నడికూడ యాదగిరి యాదవ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేతుల మీదుగా సదర్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చెప్పినమాటకు, విశ్వాసానికి కట్టుబడిన వారు యాదవులని కొనియాడారు.యాదవులకు ఎల్లవేళలా అండగా నిలబడతానని, దంగుశ్రీనివాస్ యాదవ్‌లాంటి యువ నాయ కులకు కార్పోరేషన్‌లో మంచి పదవి వచ్చే విధంగా కూడా కృషి చేస్తు న్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. అనిల్‌కుమార్ యాదవ్ లాంటి వారికి రాజ్యసభ పదవి కూడా దక్కిందని, కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడు యాదవుల పక్షమే ఉంటుందని అన్నారు. శ్రీకృష్ణుడు, అర్జునుడు ధర్మం వైపు నిలబడ్డారని, కర్ణుడు అధర్మం వైపు నిలబడినా చివరకు ధర్మమే గెలిచిందని అన్నారు. నేడు కూడా కొంతమంది అధర్మం వైపు ఉన్నారని, వారిని కూడా ధర్మ పరాక్రమవంతుల చేత ఓటమి తప్పదని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎల్లనమోని యాదయ్య యాదవ్, గున్న భీమయ్య యాదవ్, షాద్‌నగర్ తాలుకా సదర్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు నడికూడ యాదగిరి యాదవ్, షాబాద్ మల్లేష్ యాదవ్, దంగు శ్రీనివాస్ యాదవ్, నడికూడ రఘునాథ్ యాదవ్, ప్రభుత్వ ఏజీపీ అంజయ్య యాదవ్, జంగనరసింహులు యాదవ్, తుమ్మల నర్సింలు యాదవ్, ఆలుగడ్డ ప్రవీణ్ యాదవ్, ఎల్లనమోని గిరి యాదవ్, నక్క బాల్‌రాజ్ యాదవ్, సర్పంచ్ శ్రీనివాస్ యాదవ్, దొంద్ర ప్రవీణ్ యాదవ్, నడికూడ నర్సింలు యాదవ్, శ్రీశైలం యాదవ్, మల్లేష్ యాదవ్, బాలమోని మల్లేష్ యాదవ్, పద్మారం వెంకటేష్ యాదవ్, పోచమోని రమేష్ యాదవ్, రవి యాదవ్, మాధవులు యాదవ్, వయ్యారపు కిశోర్ యాదవ్, శ్రీనివాస్ యాదవ్, నడికూడ రాజు యాదవ్, మురళీ యాదవ్, సంతోష్ యాదవ్, రేణుకేష్ యాదవ్, నడికూడ అశోక్ యాదవ్, వట్టెల లింగం యాదవ్, అనిల్ యాదవ్, పూడూరు రాజు యాదవ్, చిన్నయ్య గారి వెంకటేష్ యాదవ్, పరశురాములు యాదవ్, చీపిరి రాజు యాదవ్, చందు యాదవ్, చంద్రయ్య యాదవ్‌పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ వినియోగదారుల దినోత్సవం

**షాబాద్, నవంబరు 2, ప్రభాతవార్త :** చేవెళ్ల మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ వద్ద విద్యుత్ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం విద్యుత్ సమస్యలపై పరిష్కార వేధిక నిర్వహిస్తున్నట్లు మండల విద్యుత్ ఏఈ జి.వి.కోటేశ్వర్‌రావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.... చేవెళ్ల సబ్‌స్టేషన్‌లో ఉదయం 10గంటల నుండి అందుబాటులో ఉంటామన్నారు. విద్యుత్ వినియోగదారులు విద్యుత్ సరఫరాలో ఏమైన సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావచ్చన్నారు.

## ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

**బిజెవైఎం స్వచ్ఛభారత్ సెల్ రాష్ట్ర కన్వీనర్ రాము**

**షాబాద్,నవంబరు2, ప్రభాత వార్త :** తెలంగాణ ఉద్యమ కారులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని బీజేవైఎం స్వచ్ఛభారత్ సెల్ రాష్ట్ర కన్వీనర్ రాము ప్రభు త్వాన్ని డిమాండ్ చేశారు. శనివారంషాబాద్‌లో ఆయన మాట్లాడుతూ

....తెలంగాణఉద్యమ కారులను గుర్తించడానికి ఒక కమిటీ ఏర్పాటు చేసి వారిని గుర్తించి గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. ఉద్యవ ఎకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లలలో ఉద్యమకారులకు ఉద్యమ కళా కారులకు 10శాతం కేటాయించాలన్నారు. సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి, కళాకారులకు కార్పోరేషన్‌ను ఏర్పాటు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## కురువ ఉద్యోగులకు సన్మానం



కురువ సంఘం అభ్యర్థులను సన్మానిస్తున్న దృశ్యం

**తాండూర్,నవంబరు2,ప్రభాతవార్త :** ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులకు కురువ సంఘం అద్వర్యంలో ఘనంగా సన్మానించారు. తాండూర్ పట్టణంలోని నాగారం నరసింహులు దుకాణంలో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు.పగిడాల గ్రామం నెత్తి ఎల్లప్ప కుమారుడు ఎన్.బసప్పలతో పాటు నూతనంగా ఎంబీబీఎస్‌గా సీటు సాధించిన పూజారి నర్సిములు కుమారుడు వివేక్,బీ ఫార్మసీలో సీటు సాధించిన ఇందూర్ బాలు కుమార్తె కే.దీపికలను గురువారం తాండూర్ డివిజన్ కురువ సంఘం అద్యక్షులు నాగారం జగదీశ్వర్,తాండూర్ పట్టణ అద్యక్షులు మరాఠీ నర్సిములు అద్వర్యంలో పూలమాలలు,శాలువాలతో సన్మానించారు.కార్యక్రమంలో కురువ సంఘం తాండూర్ డివిజన్,మండల అద్యక్షులు తాండూర్ పట్టణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఎబివిపి పట్టణ కమిటీ ఎన్నిక

**షాద్‌నగర్, ప్రభాతవార్త, నవంబరు 02 :** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ షాద్‌నగర్ నూతన కమిటీని ఎన్నుకున్నట్లు శంషాబాద్ విభాగ్ కన్వీనర్ సూర్యప్రకాష్ తెలిపారు. పట్టణ అధ్యక్షులుగా మధుసూదన్, కార్యదర్శిగా నవీన్ నాయక్‌లను ఎన్నుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో అతిపెద్ద స్టూడెంట్ ఆర్గనైజేషన్‌ఏబీవీపీ అని, విద్యార్థులకు ఏ సమస్య వచ్చినా అందుబాటులో ఉంటూ నిరంతరం విద్యారంగ సమస్యలపై పోరాటం చేస్తుందని అన్నారు. 1949 జులై9న ఐదు మంది విద్యార్థులతో ఢిల్లీ యూనివర్సిటీలో ఏర్పడిందని, నేడు ప్రపంచంలోనే అతిపెద్ద స్టూడెంట్ ఆర్గనైజేషన్‌గా ఏర్పడిందని అన్నారు. అదేవిధంగా పట్టణ కమిటీ ఉపా ధ్యక్షులుగా సాయి కుమార్, అక్షయ్, జగదీష్, దీపక్, సంయుక్త కార్య దర్శులుగా విజయ్, సాయి, కిరణ్, లోకేష్, నవీన్,ఎస్ఎఫ్‌డి రాజేందర్, కన్వీనర్‌గా, హాస్టల్స్ విష్ణు, మహేందర్, పవణ్, జశ్వంత్, మీడియా కన్వీనర్‌గా అనురాగ్, తదితరులు పాల్గొన్నారు.

## పేకాట ఆడుతున్న ఆరుగురిపై కేసు నమోదు

**పూడూరు, నవంబరు 2, ప్రభాతవార్త:** పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్న సంఘటన వికారాబాద్ జిల్లా చెన్‌గోముల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.చెన్‌గోముల్ ఎఎస్ఐ సత్యయ్య కథనం ప్రకారం పూడూరు మండలం పరిధిలోని మన్నెగూడ గ్రామానికి చెందిన బాయికాడి లక్ష్మయ్య,మహ్మద్ హుసేన్,ఎండి సిరాజ్, మహ్మద్ యూసూఫ్‌ఖాన్,సయ్యద్ రాహుఫ్,మహ్మద్‌తాజ్‌లు శుక్రవారం రాత్రి బాకాపూర్ శివారులోగల ఎండి యూసూఫ్ ఫాంహౌస్‌లో పేకాట ఆడుతున్నారు.నమ్మదగిన సమాచారం మేరకు చెన్‌గోముల్ పోలీసులు ఫాంహౌస్‌పై దాడిచేసి పేకాట ఆడుతున్న పైన పేర్కొన్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారినుండి రూ.10వేల 5వందల నగదుతో పాటు 3 సెల్‌ఫోన్లను స్వాదీనం చేసుకొని నిందితులపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

## గుర్తుతెలియని శవం గుర్తించడంలో పోలీసుల నిర్లక్ష్యం

**బొంరాస్‌పేట్,నవంబరు2,ప్రభాతవార్త :** బొంరాస్‌పేట్ మండల పరిధిలోని జాతీయ రహదారి 163పై తుంకిమెట్ల గ్రామం శివారులో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక పెట్రోల్ పంపు సమీపంలో ఉన్న జాతీయ రహదారిపై నిర్మించిన కల్వర్టు పక్కన గుర్తు తెలియని శవం వయస్సు(40)ను గుర్తించడం జరిగిందని ఈ విషయంను స్థానికులు పోలీస్‌లకు శనివారం ఉదయం ఫోన్ ద్వార సమాచారం ఇవ్వడం జరిగిందని సంఘటన స్థలంకు చేరుకున్న పోలీస్‌లు శవంను బయటకు తీసి సూమారు 9గంటలలు అవుతున్న శవంను గుర్తించడంలోపాటు విచారణ చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నరని స్థానికులు అరోపించారు.స్థానికులు తెలిపిన సమాచారం ప్రకారం నవాబుపేట్ మండలం అక్నాపూర్ గ్రామానికి చెందిన రాణాప్రతాప్‌గా పూడూర్ పోలీస్ స్టేషన్‌లో యువకుడు అదృష్యమైన సంఘటనపై చన్‌గోముల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు.ఈ విషయంలో బొంరాస్‌పేట్ ఎస్ఐ రాహుఫ్‌ను ఫోన్‌లో సంప్రదించగా ఫోన్‌స్వీచ్ ఆఫ్ చేసి ఎలాంటి సమాచారం ఇవ్వలేదు.

